క్లుప్తంగా

పరామర్శ



షరీఫ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన షరీఫ్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, పురుషోత్తం నాయుడు, నాగరంగయ్య పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో రైల్వే గేట్ సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో సురేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్యాపిలికి చెందిన సురేష్ పని మీద బైక్‌లో గుత్తికి బయలుదేరాడు. అయితే గుత్తి శివారులో కుక్క అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాహనాల వేలం రేపు

తాడిపత్రి అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు స్కూటీలకు ఈనెల 10వ తేదీన స్థానిక సెబ్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామని సెబ్ అధికారి విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డుతో సహా రూ.5,000 రుసుము చెల్లించి టోకెన్ పొందాలని సూచించారు.

ఎర్రమట్టి తరలిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రవీంద్ర హెచ్చరించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో టిప్పర్లు, ట్రాక్టర్ యాజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు, ఇతర ప్రదేశాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలిస్తున్నారనే ఫిర్యాదులు అందింతే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ రాము తదితరులు పాల్గొన్నారు.


భోగేశ్వరుడికి వెండి నాగాభరణం అందజేత



అర్చకుడికి నాగాభరణం అందిస్తున్న దృశ్యం

యల్లనూరు: మండల కేంద్రంలోని భోగేశ్వర స్వామి ఆలయానికి ధర్మవరం పట్టణానికి చెందిన అశ్వర్థనారాయణ భార్య ప్రమీల సోమవారం 3.50 కేజీల వెండితో తయారు చేయించిన నాగాభరణాన్ని ప్రధాన అర్చకుడు చందుకు అందజేశారు. నాగాభరణం విలువ సుమారు రూ.3 లక్షలు ఉండవచ్చని అర్చకులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థిక అభివృద్ధికి అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కేశవరెడ్డి, కృష్ణా నాయక్, జ్యోతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎల్బీ కాలనీలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. తొలుత మండలంలో ఎన్ని సంఘాలు ఉన్నాయి? ఎంత మంది సభ్యులు ఉన్నారు? ఎంత రుణాలు మంజూరు చేశారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంఘాలకు రుణ సదుపాయం, వాటి తిరిగి ఏ విధంగా చెల్లిస్తున్నారో ఆరా తీశారు. ఏ విధంగా జీవనోపాధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. సంఘాల ద్వారా ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. సంఘాల్లో ఉండే మహిళలకు ప్రభుత్వం అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మద్దిలేటి, సీసీ శంకర్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో మట్కా నిర్వహిస్తున్న మండలం పరిధిలోని నెలగొండ గ్రామానికి చెందిన పసుల వెంకటేష్ రెడ్డి, గుడిసి రాజేంద్రను సోమవారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. రూ.80,100 నగదు మట్కా పట్టీలు, పెన్నులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

‘పది’లో పేదింటి బిడ్డలు అదుర్స్

పామిడి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో పామిడి ఏపీ మోడల్ స్కూల్ టెన్త్ విద్యార్థులు సత్తా చాటారు. 96 మంది విద్యార్థులకు గాను 89 మంది ఉత్తీర్ణత సాధించారు. 92.7 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అందులో ఎస్. సమీర 571, క్రిష్ణక్రాంతి 568, బి.భవ్య 564, జి.లింగప్ప 563, చెన్నకేశవరెడ్డి 562 అత్యధిక మార్కులు సాధించారు. మొత్తం 8 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా సాధించారు. అలాగే 24 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారు. పామిడి కేజీబీవీలో 33 మంది విద్యార్థులకు గాను 24 మంది ఉత్తీర్ణతతో 72.7 శాతం ఫలితాలు సాధించారు. పి.కీర్తన 551 మార్కులు సాధించింది. పామిడి జెడ్పీహెచ్ఎస్‌లో 20 మందికి గాను 11 మంది పాసయ్యారు. ఎద్దులపల్లి జెడ్పీహెచ్ విద్యార్థి శంకర విష్ణువర్ధన్ 560 మార్కులు సాధించాడు.

పుట్లూరు: ఇటీవల విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని మడ్డిపల్లికి చెందిన రైతు దంపతులు కందకూరు ప్రతాప్‌రెడ్డి, శ్రీలత కుమారుడు జశ్వంత్‌రెడ్డి 584 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. జశ్వంత్‌రెడ్డి మండలంలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాడు.



జశ్వంత్‌రెడ్డి (584), పుట్లూరు



సమీర, (571), పామిడి



క్రిష్ణక్రాంతి (568), పామిడి



భవ్య (564), పామిడి



చెన్నకేశవ రెడ్డి (562), పామిడి



యాడికి: మోడల్ స్కూల్ విద్యార్థిని చౌడమ్మకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



యాడికి: తల్లిదండ్రులతో మండల టాపర్ మహమ్మద్ రియాజ్

యాడికి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని తూట్రాళ్లపల్లె ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తూట్రాళ్లపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి మహమ్మద్ రియాజ్ 564 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. అదే గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని చౌడమ్మ 550 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది.

కూలీల పిల్లలు.. మండల టాపర్లు



లోకేశ్వరి, (584) యల్లనూరు



స్పందన, (583) యల్లనూరు

యల్లనూరు: పెద్దమల్లేపల్లి గ్రామానికి చెందిన వీరాంజనేయులు, లక్ష్మీదేవి దంపతుల కూతురు ఎస్.లోకేశ్వరి. చిలమకూరు ఆదర్శ పాఠశాలలో చదివింది. ఇటీవల పది ఫలితాల్లో 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే తిమ్మంపల్లి హైస్కూల్ విద్యార్థిని స్పందన 583 మార్కులతో అదరగొట్టింది. గొడ్డుమర్రి గ్రామానికి చెందిన రైతు సాంబశివుడు యల్లమ్మ దంపతుల కూతరు స్పందన. ఇద్దరూ కూలీల బిడ్డలే. తల్లిదండ్రుల కష్టాల్ని గుర్తించి మంచి మార్కులతో సత్తా చాటారు. ఓ ప్రణాళిక ప్రకారం రివిజన్ చేయడంతో మంచి మార్కులు వచ్చాయని లోకేశ్వరి, స్పందన తెలిపారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

గుంతకల్లు రూరల్: గుర్రబ్బాడు గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభంకానున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

అరకటివేముల గ్రామంలో..

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

తలారి చెరువు గ్రామంలో..

తాడిపత్రి: మండల పరిధిలోని తలారి చెరువు గ్రామంలో మంగళవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సాయంత్రం 3:30 గంటలకు పట్టణంలోని 32వ వార్డు కోళ్లఫారం వీధి నుంచి కార్యక్రమం ప్రారంభంకానుంది.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

యల్లనూరు: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. సోమవారం కోడుమూర్తి, చిలమకూరు, అచ్యుతాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2024లో మళ్లీ జగనన్ననే సీఎంగా చేసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కోడుమూర్తి గ్రామంలో దళితుల శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ఓ వ్యక్తి ఎమ్మెల్యేను కోరారు. వెంటనే తహసీల్దార్ రమాదేవి కలుగజేసుకుని దళితుల శ్మశానవాటికకు 41 సెంట్లు కేటాయించినట్లు రికార్డులను చూపించారు. అయితే కావాలని వాగ్వాదానికి తెరలేపారు. అనంతరం చిలమకూరులో తనకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.లక్ష వరకూ లబ్ధి చేకూరిందని ఓబుళమ్మ అనే మహిళ ఎమ్మెల్యేతో సంతోషం పంచుకున్నారు. కోడిమూర్తి గ్రామంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నుంచి ఏయే పథకాలు అందుతున్నాయని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పుట్లూరు సీఐ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వర రెడ్డి, జెడ్పీటీసీ భోగాతి విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, చిలమకూరు సర్పంచ్ పెద్ద నాగరాజు, తహసీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, హౌసింగ్ ఏఈ సుప్రజారెడ్డి, ఏపీఎం ముత్యాలప్ప, నాయకులు రామాంజినేయ రెడ్డి, పురుషోత్తం నాయుడు, నాగరంగయ్య పాల్గొన్నారు.

25 మందికి కంటి పరీక్షలు

పెద్దపప్పూరు: ముచ్చుకోటలో సోమవారం డివిజన్ జీపీఎంటీఓ మధుసూదన రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కళ్యాణ్, ఉషారాణి మొత్తం 25 మందిని పరీక్షించారు. ఐదుగురిని ఆపరేషన్ కోసం అనంతపురం రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథ్ రెడ్డి, యువ నాయకుడు పీవీ రమణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు నాగరత్నాలు, చిన్న కంబయ్య, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

‘అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటు’



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమణమ్మ, నాయకులు రామశేఖర్, ఉమ్మడి గురుప్రసాద్ రెడ్డి

తాడిపత్రి: తాడిపత్రి గన్నెవారిపల్లి కాలనీలో రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరినట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటు అని జెడ్పీటీసీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రామశేఖర్, ఉమ్మడి గురుప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం గన్నెవారిపల్లి కాలనీలో వారు విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కాలనీలో పర్యటనలో భాగంగా వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు టీడీపీతో తీర్థం పుచ్చుకున్నట్లు చేస్తున్న ప్రచారం అసత్యమన్నారు. కేవలం ఓ ఐదారు కుటుంబాలు పార్టీ మారితే వైఎస్సార్‌సీపీ వారని చెప్పడం సిగ్గుచేటన్నారు. టీడీపీలో చేరిన వారికి ఇప్పటి వరకూ ఏ పార్టీకీ సంబంధం లేదని స్పష్టం చేశారు.

పంచాయతీ అభివృద్ధికి చేసిందేమీ లేదు..

మాజీ టీడీపీ సర్పంచ్ చింబిలి వెంకటరమణ గన్నెవారిపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. పంచాయతీ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుపడుతున్నారని చెప్పడం దుర్మార్గమన్నారు. అక్రమాలతో చేయని పనులను చేసినట్లుగా చూపి, బిల్లులు పొందారని తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, అక్రమంగా సంపాదించుకున్నారని చెప్పారు. మాజీ టీడీపీ సర్పంచ్ చింబిలి వెంకటరమణను గొప్ప వ్యక్తి అంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి పొగడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జనరల్ ఫండ్ ఎక్కువగా వచ్చే పంచాయతీకి ఇప్పటి వరకూ చెత్తను పారవేయడానికి కనీసం 5 ఎకరాల స్థలం కొనుగోలు చేయలేకపోయారంటే గత పాలనలో సర్పంచులు ఎంతలా అభివృద్ధి చేశారో తెలుస్తోందన్నారు. ముఖ్యంగా కాలనీ ప్రజలు ఇప్పటి వరకూ పంచాయతీ పెద్దల, ప్రజా ప్రతినిధుల ముసుగులో బొక్కిన ప్రజాధనంపై ఒక్కసారి ఆలోచించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో దాదాపు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.

సొంతింటి కల సాకారం చేస్తాం

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- 6వ వార్డులోని పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: నిలువ నీడలేని నిరుపేదలకు స్థలాలిచ్చి వారి సొంతింటి కలను సాకారం చేయడమే జగనన్న నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మూడు నెలల క్రితం 6వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తమకు ఇంటి స్థలాలివ్వాలని వార్డు కౌన్సిలర్ దర్గా చెన్నమ్మ ద్వారా పేదలు ఎమ్మెల్యే వైవీఆర్‌కు విన్నవించారు. ఇచ్చిన మాట ప్రకారమే ఎమ్మెల్యే వైవీఆర్ సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో 15 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలిచ్చారు. అర్హత కలిగిన వారందరికీ నవరత్నాలు–పేదలందరికీ పథకం కింద ఇళ్లు కూడా మంజూరు చేయిస్తామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్‌ను వార్డు కౌన్సిలర్ చెన్నమ్మ, లబ్ధిదారులు శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ దర్గానాయుడు, వార్డు సచివాలయ కన్వీనర్ జెన్నేమస్తాన్, నాయకులు గోపాల్, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, నాగేంద్ర, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పరిశ్రమలు నెలకొల్పండి

గుంతకల్లుటౌన్: గుంతకల్లులో మూతపడిన ఆంధ్రా కో-ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లులో ప్రత్యామ్నాయ పరిశ్రమలు నెలకొల్పి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఎం.గౌతమిని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే వైవీఆర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిల్లు ద్వారా బ్యాంకులు, ఇతర సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించి ప్రత్యామ్నాయ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ పేట రైల్వేబ్రిడ్జి విస్తరణతో పాటు ధర్మవరం రైల్వేగేట్, హనుమాన్ సర్కిల్ లెవెల్ క్రాసింగ్ గేట్‌ల వద్ద రైల్ అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయించి జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. పలు ఎఫ్‌పీ షాపుల్లో బఫర్ షార్టేజీతో సంబంధం లేకుండా ప్రజలకు అవసరమైన మేర స్టాక్‌ను సరఫరా చేయాలన్నారు. కస్తూరిబా విద్యాలయాల్లో సీట్లు పెంచాలన్నారు. మండలంలోని గుండాల, గుండాలతాండా గ్రామాల్లో స్టోరేజీ ట్యాంకులను నిర్మించాలని వినతిపత్రాన్ని అందజేశారు.


వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



యాడికి: గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి:/యల్లనూరు/తాడిపత్రి అర్బన్/పెద్దవడుగూరు/గార్లదిన్నె/యాడికి/శింగనమల/పామిడి: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని గ్రంథాలయల్లో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని.. విద్యార్థులందరూ తప్పనిసరిగా గ్రంథాలయాలను ఆశ్రయించాలని గుత్తి ఎంఈఓ రవి నాయక్ సూచించారు. యల్లనూరులోని గ్రంథాలయంలో ఉచిత సమ్మర్ క్యాంపులో భాగంగా క్రీడా పోటీలు ప్రారంభించినట్లు లైబ్రరియన్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతందని తాడిపత్రి గ్రంథాలయ అధికారి బి.రవికుమార్ నాయుడు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని పెద్దవడుగూరు ఎంఈఓ రాముడు కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికితీయడానికి వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడుతాయన్నారు. పుస్తక పఠనాశక్తి పెంచేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని గార్లదిన్నె ఎంఈఓ చంద్రనాయక్, ఎంపీడీఓ విజయ భాస్కర్, గ్రంథాలయ అధికారి శిరీష పేర్కొన్నారు. పిల్లలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ మధుసూధన్ సూచించారు. యాడికి గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. సమయం వృథా చేసుకోకుండా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని శింగనమల గ్రంథాలయాధికారి కృష్ణ, పామిడి ఎంఈఓ జయానాయక్, గ్రంథాలయాధికారిణి వెంకటలక్ష్మి అన్నారు.

అభివృద్ధికి ఓటు వేయండి



పథకాల లబ్ధితో కూడిన కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ‘గడప గడపకూ మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: గత నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఊరుచింతల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ పథకాల లబ్ధిని తెలుసుకున్నారు. గతంలో ఇంతలా ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాలు ఏవైనా ఉన్నాయా అని గ్రామస్తులను అడిగారు. ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు సంతోషంగా తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ ఆరా తీశారు. ఫించన్లు మంజూరు చేయించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నిబంధనల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని పథకాలు తప్పనిసరిగా అందిస్తామని తెలిపారు. ఎస్సీ కాలనీలో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పందిస్తూ.. త్వరితగతిన కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు. కాలనీలో తాగునీటి పైపులైన్ పనులు జరుగుతున్నాయని అధికారులు బదులిచ్చారు. కాలనీలోని రెండు వీధుల్లో పనులు పూర్తి అయ్యాయని, కొద్ది మేర మిగిలిన పనులు త్వరలోనే పూర్తి అవుతాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అభివృద్ధి పథంలో తాడిపత్రిని ముందుకు తీసుకువెళ్తామన్నారు. మంచి చేసే నాయకులను ఎల్లప్పుడూ ఆదరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, ఎంఈఓ నాగరాజు, పీఆర్ ఏఈ విజయలక్ష్మి, వెలుగు సీసీ మధుసూదన్ రెడ్డి, ఏపీఓ గంగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌సీ చంద్ర ఓబుళరెడ్డి, శంకర్ గౌడ్, తలారి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి అర్బన్: చాలవేముల, ఎం.కొట్టాలపల్లి, దిగువకొత్తూరులో అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న ఆయా, మినీకార్యకర్తల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.షాజిదా బేగం సోమవారం తెలిపారు. మొత్తం 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 12వ తేదీలోపు అభ్యర్థులు తమ దరఖాస్తులను తాడిపత్రి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

లోక రక్షకుడు ‘క్రీస్తు’

పామిడి: సర్వలోక పాపపరిహారార్థం యేసు క్రీస్తు ఈ లోకానికి రక్షకుడిగా వచ్చాడని గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ నెహమ్యా అన్నారు. సోమవారం స్థానిక హైవేలో హనుమాన్ లింకురోడ్డు సర్కిల్ సమీపంలో శాశ్వత కృప మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అందరికీ రక్షణ శుభవార్త సభలు ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు కార్యక్రమాలు జరగనున్నాయి. అంతకుముందు కీర్తన బృందం ఆలపించిన దేవుని భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ మినిస్ట్రీస్ నిర్వాహకులు విజయ్ ఛార్లెస్, పీటర్ విజయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ జాతర

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో సోమవారం అంకాలమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. అంకాలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పెద్దవడుగూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దాసరి సువర్ణ రాజన్న పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అనంతరం క్రిష్టిపాడులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. రవికుమార్, మహేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తాడిపత్రి అర్బన్: క్రీడలతోనే మానసికోల్లాసం పెంపొందుతుందని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు శివయ్య అన్నారు. సోమవారం స్థానిక సంజీవనగర్‌లోని మొదటి రోడ్డులో గాయత్రీ ఆలయం పక్కన ఉన్న మైదానంలో ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వరుణ్, కబడ్డీ కోచ్ నరసింహ, వ్యాయామ ఉపాధ్యాయులు దాదా ఖలందర్, ఇర్షాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు: విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ.రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ డిగ్రీ హాస్టళ్లు మూసి వేయడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

డీ పట్టాలు అందజేయాలని వినతి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు డీ పట్టాలను అందజేయాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం ఆర్డీఓ రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే డీ పట్టాలను, పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేయాలన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

తాడిపత్రి అర్బన్: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. తాడిపత్రి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఉచిత సమ్మర్ స్పెషల్ క్యాంపు ప్రారంభించారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన మాస్టర్ రంగనాథరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ ప్లేయర్‌కు అభినందన

గుంతకల్లు: తిరుపతిలో ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకూ జరిగిన ఏపీ సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో శ్రీ శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాల విద్యార్థిని తన్మయి మూడో స్థానం నిలిచి కాంస్య పతకం సాధించింది. సోమవారం తన్మయిని కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ బి.గోపాల్ తదితరులు అభినందించారు.